క్లుప్తంగా

పరామర్శ



ఎస్ఎస్ తాడ్వాయి: హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెబోయిన సృజనను మంత్రి సీతక్క గురువారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి పరామర్శించి తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఆర్థిక సాయం

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాపురానికి చెందిన హమాలీ కూలీ రాజుకు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. దీంతో రాజుకు తోటి హమాలీ కూలీలు గురువారం ఆరు వేల రూపాయల నగదు, 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. మాటూరి వెంకట్, కొండరెడ్డి, దుర్గారావు, శ్రీను, వెంకటేశ్వర్లు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



ఏటూరునాగారం: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని సీఐ రాజు అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఏటూరునాగారం స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదా నంలో గురువారం నిర్వహించారు. ఈ క్రీడలను స్థానిక సీఐ రాజు, ప్రముఖ వైద్యుడు వరప్రసాద్ హాజరై ప్రారంభించి మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహభావం మెరుగుపడుతుందన్నారు. గెలుపు ఓటములు సహజం అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, స్పోర్ట్స్ క్లబ్ కోచ్ పర్వతాల కుమారస్వామి, వైద్యులు వెంకటేశ్వర్లు, హెడ్మాస్టర్ సాంబశివరావు, రామన్నగూడెం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మల్లయ్య, వావిలాల కిషోర్, వావిలాల తేజ, పాషా, పీఈటీ రాజు, రవి పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటేయండి

వాజేడు: నిర్భయంగా ఓటు వేయాలని కవచంలా తాముంటామని వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పేరూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక శక్తులకు ఎవరూ భయపడవద్దని ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా ఓటు వేయకూడదని భయభ్రాంతులకు గురిచేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఆయన వెంట వాజేడు, పేరూరు ఎస్సైలు వెంకటేశ్వరరావు, రమేష్ ఉన్నారు.

ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలి



వెంకటాపురం(కె): ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకటాపురం, వాజేడు మండలాల్లో ఆదివాసీల భూములను వలస గిరిజనేతరులు అక్రమించుకుంటున్నారని అన్నారు. గిరిజన చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు పట్టించుకోవటం లేదని అన్నారు. ధరణి పోర్టల్ వల్ల గిరిజనులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం ప్రతాప్, రేగ గణేష్, చింత మోహన్, కనితి వెంకటకృష్ణ, రాజబాబు, చంటి తదితరులు ఉన్నారు.

సభను జయప్రదం చేయండి

గోవిందరావుపేట: హైదారాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో ఈ నెల 12న సీఎం రేవంత్‌రెడ్డికి జరిగే ఉద్యమకారుల కృతజ్ఞత సభకు జిల్లాలోని ఉద్యకారులంతా హాజరై విజయవంతం చేయాలని ఉద్యమకారుల మండల అధ్యక్షుడు మేడుదుల వెంకన్న అనఅనరు. మండల కేంద్రంలో గురువారం ఉద్యమ కారుడు డా.హేమాద్రి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి వెంకన్న హాజరై మాట్లాడారు. ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డులను ఇచ్చి, ప్రతి నెల పెన్షన్ సౌకర్యం కల్పిస్తూ, ఆరు గ్యారంటీలలో సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు సూరినేని శ్రీనివాస రావు, మండల ప్రధాన కార్యదర్శి కదారి తిరుపతి, మహిళ జిల్లా అధ్యక్షురాలు బత్తుల రాణి, ఆకినపల్లి రమేష్, దర్శనాల సంజీవ్, చుక్క గట్టయ్య పాల్గొన్నారు.

ఉత్సవాలకు రామప్ప సిద్ధం

- నేడు వైభవంగా శివపార్వతుల కల్యాణం
- ఏర్పాట్లు చేసిన అధికారులు



రామప్ప ఆలయం

వెంకటాపురం(ఎం): ప్రపంచ వారసత్వ సంపద కలిగిన రామప్ప దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా మూడురోజుల పాటు జరిగే ఉత్సవాలకు రామప్ప సిద్ధమైంది. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆదనపు కలెక్టర్ శ్రీజ, ఎస్పీ శబరీష్ ఎప్పటికపుడు ఏర్పాట్లను పరిశీలించారు. శుక్రవారం రాత్రి 10గంటలకు అంగరంగవైభవంగా శివపార్వతుల కల్యాణాన్ని ఆలయ అర్చకులు కోమళ్లపల్లి హరీష్‌శర్మ, ఉమాశంకర్ నిర్వహించనున్నారు. శివపార్వతుల కల్యాణాన్ని తిలకించేందుకు సుమారు లక్షమంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.

భక్తుల కోసం సకల సౌకర్యాలు

మహాశివరాత్రి సందర్భంగా రామప్పను సందర్శించే భక్తుల కోసం అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో గతంలో కంటే భిన్నంగా రామలింగేశ్వర స్వామిని దర్శించుకునే సాధారణ భక్తులకు, స్వామివారికి అభిషేకాలు నిర్వహించే భక్తులకు వేరువేరుగా క్యూలైన్లను ఏర్పాటు చేశారు. రామప్ప ఆలయం చుట్టూ, రామప్ప గార్డెన్‌లో, పార్కింగ్ ప్రదేశాలలో సుమారు 200 ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌కో ఏఈ సురేష్, సబ్ ఇంజనీర్ రాజు, లైన్ ఇన్స్‌పెక్టర్ సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిరంతర విద్యుత్ కోసం ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ కనెక్షన్లను ఇచ్చారు. వరదల వల్ల కొట్టుకపోయిన రామప్ప తూర్పు రోడ్డుపై తాత్కాలికంగా మట్టిపోసి అందుబాటులోకి తెచ్చారు. వెంకటాపురం ఎస్సై చల్లా రాజు ఆధ్వర్యంలో పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా మూడు చోట్ల భారికేడ్లు ఏర్పాటు చేసి 150 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నారు.

సాయంత్రం 6 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు

రామప్ప ఆలయానికి వచ్చే జాగరణ చేపట్టిన భక్తుల కోసం శుక్రవారం సాయంత్రం 6గంటల నుంచి శనివారం ఉదయం 6గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సాయంత్రం 6గంటలకు రంజిత్ బృందంచే పేరిణి నృత్యం, 7గంటలకు అంజయ్య బృందం ఆధ్వర్యంలో ఒగ్గుడోలు, 7:30గంటలకు కృష్ణప్రియ నేతృత్వంలో కూచిపూడి నాట్యం, 8:30గంటలకు నర్సింహమూర్తి ఆధ్వర్యంలో హరికథ, 9:30గంటలకు కళ్యాణ్, రాణాప్రతాప్ ఆధ్వర్యంలో మిమిక్రీ, మ్యాజిక్ షో, 10:30గంటలకు కాట్రగడ్డ హిమన్షి ఆధ్వర్యంలో కూచిపూడి నాట్యం, 11:30గంటలకు అర్జున్ కళాబృందం ఆధ్వర్యంలో ఆర్కెస్ట్రా, 12:30గంటలకు శంకర్ ఆధ్వర్యంలో చెక్క బొమ్మలాట, అర్ధరాత్రి 1:30గంటలకు పూర్ణజ్యోతి ఆధ్వర్యంలో బోనాల కోలాటం, 2గంటలకు నారాయణ ఆధ్వర్యంలో మ్యాజిక్ షో, 2:30గంటలకు గూడ పోశెట్టి ఆధ్వర్యంలో శివార్చన కార్యక్రమం, 3:30గంటలకు గడ్డం రజిత నేతృత్వంలో కోలాటం, తెల్లవారుజామున 4గంటలకు పగిడిపల్లి సుధాకర్ ఆధ్వర్యంలో బైండ్ల కథ, 5గంటలకు నీలకంఠం బృందంచే చిందు యాక్షగానం కార్యక్రమాలు జరగనున్నాయి.



ఆలయ అధికారులతో మాట్లాడుతున్న శ్రీజ

రామప్పలో ఏర్పాట్ల పరిశీలన

మహాశివరాత్రి సందర్భంగా రామప్పలో చేపట్టిన ఏర్పాట్లను అదనపు కలెక్టర్ శ్రీజ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హనుమకొండ నుంచి ప్రతీ 30 నిమిషాలకు ఒక బస్సు, ములుగు నుంచి 15 నిమిషాలకు ఒక ఆర్టీసీ బస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అనంతరం రామప్ప రామలింగేశ్వరస్వామిని దర్శించుకోగా ఆలయ అర్చకుడు హరీశ్‌శర్మ తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్, ఎంపీడీఓ రాజు, ఈజీఎస్ ఏపీఓ నారగోని సునీత పాల్గొన్నారు.

ఘనంగా బాలకుమారస్వామి జాతర



బాలకుమారస్వామిని ఆలయానికి తీసుకువస్తున్న పూజారులు

ములుగు రూరల్: మండలంలోని అంకన్నగూడెంలో గురువారం బాలకుమారస్వామి జాతరను ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం ఘనంగా నిర్వహించారు. మేడారం సమ్మక్క–సారలమ్మలకు తమ్ముడిగా పిలువబడే బాలకుమారస్వామిని ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జాతర నిర్వహిస్తారు. కొట్టెం, అల్లెం వంశస్తులు పూజారులుగా వ్యవహరిస్తారు. జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య ఆధ్వర్యంలో ప్రధాన పూజారులు సారయ్య, బాలయ్యలు తాడ్వాయి మండలం కొడిశల శివారులోని బిట్టుగుట్ట నుంచి బాలకుమారస్వామిని పూజారులు డోలి వాయిద్యాల నడుమ గ్రామ శివారుకు తీసుకురాగా, గ్రామ మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అక్కడ నుంచి వడ్డెలు స్వామి వారిని ఆలయానికి తీసుకువచ్చి గద్దెకు చేర్చారు. దీంతో ఆలయ పరిసరాలు శివసత్తుల పూనకాలతో సందడిగా మారాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి సంతానం లేని మహిళలు బాలకుమారస్వామిని ఆలయానికి తీసుకువస్తున్న సమయంలో ఆలయం ముందు వరం పట్టారు. అనంతరం గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింత శ్యామల, ఎంపీటీసీ ఈక స్వరూప కృష్ణ, అల్లం భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్



నిందితులను చూపిస్తున్న పోలీసులు

వాజేడు: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకోవడంతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్ తెలిపారు. వాజేడు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఎస్సై వెంకటేశ్వరరావుతో కలిసి వివరాలను తెలిపారు. మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద ఎస్సై వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ఛత్తీస్‌గఢ్‌లోని భూపాలపట్నం నుంచి వెంకటాపురం(కె) వైపు వెళ్తున్న బస్ నంబర్ సీజీ17 కేఆర్ 2636 ఆపి తనిఖీ చేశారు. బస్సులో ఉన్న వారిలో నుంచి మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన బోనగిరి సాయికుమార్, వెంకటాపురం(కె) మండల పరిధిలోని శాంతి నగర్ కాలనీకి చెందిన తాటి రఘు పోలీసులను చూసి పారి పోతుండగా పట్టుకున్నారు. వారి వద్ద 0.50 కేజీల గంజాయి దొరికింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరిద్దరికి గంజాయి తాగే అలవాటు ఉందని ఈ కారణంగా స్నేహితులుగా మారినట్లు తెలిపారు. కొద్ది రోజులుగా తాగడానికి గంజాయి దొరుకకపోవడంతో బీజాపూర్ వెళ్లి అక్కడ గంజాయిని కొనుక్కొని తిరిగి వస్తుండగా పట్టుబడినట్లు సీఐ వెల్లడించారు. కాగా వీరిపై కేసు నమోదు చేసిన రిమాండ్‌కు తరలించారు. వీరిలో తాటి రఘు బాల నేరస్తుడిగా ఉన్నట్లు వెల్లడించారు. వీరి నుంచి అరకేజీ గంజాయితో పాటు రియల్ మీ ఫోన్ స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటయ్య

మంగపేట: మండల కేంద్రంలోని ఎక్కటి సరోనీ, శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్ని పాఠశాలల విద్యార్థులు తమ కాలేజీలోనే చేరాలని పదోతరగతి విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటయ్య కోరారు. మండలంలోని కమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆర్ఎంసీ, ఆదర్శ ప్రవేటు పాఠశాలలను కాలేజీ అధ్యాపకులతో కలిసి ఆయన గురువారం సందర్శించి అడ్మిషన్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన చేస్తూ ప్రతి విద్యా సంవత్సరంలో ప్రవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నామని గత ఏడాది 93.3 శాతం ఫలితాలతో పాటు 1000 మార్కులకు 982 సాధించి జిల్లా స్థాయిలో టాపర్‌గా నిచిచామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంతో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు అందరు తమ కాలేజీలో అడ్మిషన్ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న వలియాబీ

ఏటూరునాగారం: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆమె గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. లెక్చరర్లు బోధించే పాఠాలను శ్రద్ధగా విని విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలకు సిద్ధమై మంచి ఫలితాలను సాధించాలన్నారు. అలాగే పరీక్ష కేంద్రంలోకి సమయానికి చేరుకునే విధంగా ప్లాన్ చేసుకోవాలన్నారు. హాల్ టికెట్ నంబర్ సరిచూసుకుని సెంటర్ సమాచారం తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ అరుణ, లెక్చరర్లు, టీచర్లు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ మందిరంలో కేక్ కట్ చేసి మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా ప్రారంభించారు. అనంతరం జిల్లాలోని మహిళ ఉద్యోగులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి అదనపు కలెక్టర్ శ్రీజ శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనిన్, మైనార్టీ సంక్షేమ అధికారి ప్రేమలత, పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

మహిళలు చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ పీవీపీ లలిత శివజ్యోతి అన్నారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లా కోర్టులో గురువారం ఘనంగా నిర్వహించి పలువురు జడ్జిలను సన్మానించారు. ఈ కార్యక్రమానికి శివజ్యోతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్త్రీలు చదువుకోవడం వల్ల కుటుంబాన్ని, పిల్లల్ని కాపాడుకోగలుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి టి.మాధవి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి డి.రాంమోహన్‌రెడ్డి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె.సౌఖ్య, ముఖ్య పరిపాలనాధికారి అనూఫ్‌కుమార్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.శ్యామ్‌ప్రసాద్ తదితరులుపాల్గొన్నారు.



ములుగు: కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

వెంకటాపురం(ఎం): మహిళలు అన్ని రంగాల్లో ముందుండి మహిళా సాధికారతను సాధించాలని డీఈఓ పాణిని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ మండలాధ్యక్షుడు లకావత్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి విజయమ్మ, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, సంఘం నాయకులు విష్ణుమూర్తి, స్రవంత్, రమేష్, లవణిక, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: మహిళా శక్తి ప్రపంచానికే స్ఫూర్తి అని, మహిళల అభ్యున్నతి ద్వారనే కుటుంబం, సమాజ అభివృద్ధి సాధ్యం అవుతుందని హెచ్ఎం భాస్కర్ రావు అన్నారు. మండలంలోని రాజుపేట జెడ్పీ హైస్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు జమున, రాజ్యలక్ష్మి, పద్మ, సుజాత, పావని, హాదేవి, పఠాన్ ఆస్మా, ప్రమీల, స్రవంతి పాల్గొన్నారు.



ములుగు: సన్మాన కార్యక్రమంలో శివజ్యోతి

ములుగు రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు గురువారం కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహింగా ప్రిన్సిపాల్ మల్లేషం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. అనంతరం మహిళా సాధికారత విభాగం ఇన్‌చార్జ్ లే.ఓలత మాట్లాడుతూ.. విద్యార్థినులు మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యను నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ రమేష్‌చంద్ర శ్రీకాంత్, వెంకన్న, నవీన్, నాగమణి, విజిత, ఉదయ, సమ్మయ్య, యుగేందర్ పాల్గొన్నారు.

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహిళ దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ జవహర్‌రెడ్డి గురువారం మండలంలోని ప్రజాప్రతినిధులను శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో చాపల ఉమాదేవి, ఏలిసాల స్వరూప, ధరావత్ పూర్ణ, ఆలూరి శ్రీనివాస్ రావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

ముస్తాబైన శివాలయాలు



ఏటూరునాగారం: పెళ్లి పందిరిపై పాలపారకను అలంకరిస్తున్న ప్రజలు

ఏటూరునాగారం: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. గురువారం అడవి నుంచి పాలపారకను తీసుకువచ్చి ఆలయంపై అలంకరించారు. ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. ఓడవాడ నుంచి ఎడ్లబండ్లలో సంప్రదాయబద్ధంగా డోలు వాయిద్యాలతో గ్రామస్తులు, ఆలయ చైర్మన్ మడుగూరి ప్రసాద్, డైరెక్టర్లతో కలిసి ఆలయానికి చేరుకున్నారు. పచ్చని పెళ్లి పందిరికి అలంకరించారు. అనంతరం ఆలయంలో అర్చకులు రాజ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఎదురుకోళ్ల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

కల్యాణానికి ఆహ్వానం

శివరాత్రి వేడుకల్లో భాగంగా నేడు(శుక్రవారం) జరిగే శివపార్వతుల కల్యాణానికి సీఐ రాజు, ఎస్సై గుర్రం ప్రసాద్‌లను ఆహ్వానించినట్లు చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్లు వల్స తిరుపతి, రాంలాల్, కిరణ్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు దుర్గం కొమురయ్య, సోమందపు నర్సింహులు, పెద్ద బోయిన అర్జున్, చెన్నం లాలమ్మ పాల్గొన్నారు.

రామన్నగూడెంలో..

మండలంలోని రామన్నగూడెంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సం సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయం ప్రత్యేక పూజలు చేసినట్లు అర్చకులు సాయి తెలిపారు.

నందీశ్వర మహోత్సం

మండల కేంద్రంలోని ఉమారామలింగేశ్వరస్వామి ధ్వజస్తంభం వద్ద నందీశ్వర మహోత్సవాన్ని అర్చకులు రాజ్‌కుమార్, సిద్ధాంతిశర్మలు నిర్వహించారు. ఎదురకోళ్ల పూజలను బొడ్రాయి వద్ద, ఆలయంలో నిర్వహించారు.

వెంకటాపురం(కె): వెంకటాపురం మండల కేంద్రంలోని ఉమారామలింగేశ్వస్వామి ఆలయం నేటి నుంచి ప్రారంభమైయ్యే శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. శుక్రవారం స్వామి వారి కల్యాణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వాజేడు: మండల పరిధిలోని జంగాలపల్లి, ప్రగళ్లపల్లి, అయ్యవారిపేట గ్రామాల్లో శివ పార్వతుల కల్యాణాన్ని నేడు(శుక్రవారం) నిర్వహించేందులు భక్తులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. అయ్యవారిపేట గ్రామంలో గోదావరి సమీపంలో ఉన్న పురాతణ ఆలయం వద్ద చలువాకు పందిల్లు వేసి తీర్చిదిద్దారు. అదే విధంగా జంగాల పల్లిలో గ్రామంలో శ్రీ ఉమామహేశ్వర స్వామి ఉత్సవ కల్యాణం జరిపించేందుకు కొంగాల వాగు సమీపంలో చలువాకు పందిల్లు వేసి సిద్ధం చేశారు. మండల పరిధిలోని ప్రగళ్లపల్లి గ్రామంలో సతీ సమేత శ్రీకాశీ ఉమామహేశ్వర స్వామి వారి కల్యాణం ఘణంగా జరిపించడానికి ఏర్పాట్లను పూర్తి చేశారు.

రక్తదాన శిబిరం

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని దుర్గమ్మ గుడి సెంటర్‌లో గురువారం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఎస్సై అశోక్ ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేయటం ప్రాణదానంతో సమానమన్నారు. చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయం అన్నారు. మాజీ సర్పంచ్ చిడెం యామిని, చిడెం రవికుమార్, చిడెం ప్రకాష్, చిడెం ముత్తయ్య, తదితరులు ఉన్నారు.

నిధులు విడుదల చేయాలి

వెంకటాపురం(ఎం): రెండవ విడత దళితబంధు నిధులను విడుదల చేయాలని కోరుతూ మండలంలోని లక్ష్మీదేవిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి దళిత బంధు సాధన సమితి రాష్ట్ర నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు జనగాం రవి మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన రెండవ విడత దళితబంధు నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పత్తిరి దశరథం, తిరుపతి, రవి, భద్రయ్య, లచ్చులు, సురేష్ పాల్గొన్నారు.

దళితబంధు ఇవ్వాలి

ఏటూరునాగారం: దళితబంధుకు ఎంపికైన అభ్యర్థులకు వెంటనే నిధులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో దళిత బంధు యూనిట్ల లబ్ధిదారులు కళ్లకు గంతలు కట్టుకొని అంబేడ్కర్ చిత్రపటానికి వినతి పత్రాన్ని అందజేసి నిరసన వ్యక్తం చేశారు. కుమ్మరి చంద్రబాబు, రామకృష్ణ, ముత్తయ్య, తిరుపతి, రాజేష్, సారయ్య, శ్రీరామ్, పద్మ, నర్సయ్య, లాలయ్య, రవీందర్ పాల్గొన్నారు.

విజయపురి కాలనీలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని విజయపురికాలనీలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ 63 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అరంతరం ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.


ఆదివాసీలకే ఎంపీ టికెట్ ఇవ్వాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

వాజేడు: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం అన్ని రాజకీయ పార్టీలు ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీ అఖిల పక్ష జేఏసీ నాయకులు గురువారం వాజేడులో కరపత్రాలను ఆవిష్కరించారు. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయని అందులో మెజారిటీ స్థానాలు ఆదివాసీలకే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్య దర్శి సాయి, ప్రతాఫ్, రాజబాబు, అనిల్, నర్సిమూర్తి, సునీల్‌తో పాటు తదితరులు ఉన్నారు.

తునికాకు ప్రూనింగ్ వెంటనే చేపట్టాలి



ములుగు రూరల్: తునికాకు ప్రూనింగ్ పనులను వెంటనే చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా అటవీశాఖ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు తునికాకు సేకరణ రెండవ పంటలాంటిదని అన్నారు. ప్రూనింగ్ చేపట్టడం వల్ల నాణ్యమైన ఆకు వస్తుందని అన్నారు. 50ఆకుల కట్టకు రూ. 5 చెల్లించాలని అన్నారు. ప్రభుత్వం తునికాకు బోనస్ రూ.200 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు కాని తునికాకు కూలీలకు మాత్రం అందలేదని అన్నారు. అటవీశాఖ అధికారులు జోక్యం చేసుకొని బోనస్ డబ్బులను కూలీలకు అందించేవిధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిరెడ్డి సాంబశివ, రాజేందర్, వాసు, రఘుపతి, కొర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.